# లోయలు - శిఖరాలు

శ్రీ కలువకొలను సదానంద

ప్రొద్దు గ్రుంకుతున్నవేళ—ఫారెస్ట్ బంగళా ఎదుట పేము కుర్చీలో—నేనూ మా ఆవిడా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం.

పడమటిదిక్కున సూర్యకిరణాలు—రుద్రభూమిలో గాయపడి కాలికి బుద్ధి చెబుతున్న సైనికులవలె క్రమేణా అదృశ్యమైపోతున్నాయి. చీకటి తెరలు నలు మూలలనుంచీ కమ్ముకుంటూ, ప్రకృతిసుందరికి నల్ల ముసుగు తొడుగుతున్నాయి. చల్లగా మృదువుగా శరీరాల్ని తాకుతూ ఎక్కడికో ప్రయాణంచేస్తున్న పిల్ల వాయువులు క్షణంలో గొప్పవేగాన్నందుకుని హోరుమని శబ్దంచేస్తూ అక్కడి వృక్షజాలాన్నంతటినీ కదిపివేయ సాగాయి. పాపం, కొద్దిక్షణాలక్రితం చెట్లకొమ్మల్లో కిచకిచలాడుతూ స్వేచ్ఛగా విహరిస్తూవుండిన చిలుకలు, గోరవంకలు, అడవిపావురాలు, ఏవేవో పిట లు ఇప్పుడు గాఢాంధకారంలో వాటి నివాసాలలోంచి తొంగి చూడ్డానిక్కూడా సాహసించలేకుండా వున్నాయి. వాటి మధుర ధ్వనులేవీ ఈ హోరుగాలిలో వినిపించడం లేదు.

కాస్సేపటికి చలికూడా ప్రారంభమయ్యేసరికి 'ఇక లోపలి కెళ్దాం పద' అంది మా ఆవిడ. ఇద్దరమూ లేచి లోపలికి నడిచాము.

భోంచేద్దామం అప్పటికింకా ఏడుగంటలు కూడా కాలేదు. నిద్రపోవటానిక్కూడా సమయం కాక పోవటంచేత, మరోగంట ఎలా వెళ్లబుచ్చడమా అంటూ ఆలోచించసాగాను.

'అబ్బ, కాళ్ళు పీకుతున్నయ్ ..' అంది సరస్వతి నీరసంగా. నిజమే. ఆమాటకొస్తే నాక్కూడా కాస్త బడలికగానే వుంది.

హార్సిలీ కొండ చూడాలని చాలరోజులనుంచీ అనుకుంటున్నా, పరిస్థితులు అనుకూలించకపోవడం మూలాన ప్రయాణం వాయిదాపడుతూనే వుండేది.

...అసలు ఈ 'హార్సిలీ హిల్స్' అనే పేరు ఇటీవలికాలంనుంచే ఆంధ్రావనిలో వినిపిస్తూంది. ఆంధ్రలో ఒక్కగా నొక్క వేసవి విడిదిగా యిప్పుడే ప్రాముఖ్యత నందుకుంటోంది. మనదేశంలోని అతి సుందరమైన వేసవి విడుదుల్లో ఒకటిగా గణనకు రాకపోయినా, ఊటీ సిమ్లాలవలె ఆడంబరాలను అలంకరించుకోక పోయినా ఒక్కసారైనా వెళ్ళి చూడాలనే కుతూహలం రోజురోజుకీ పెంపొందసాగింది. ఆఖరికి మూడురోజుల సెలవుతో బయలుదేరాం. రైలు కురబలకోట చేరుకునేటప్పటికి మధ్యాహ్న పదకొండు గంటలయింది. అక్కణ్ణుంచి బస్సు ప్రయాణం ఎనిమిదిమైళ్లు. కొండ, సమీపిస్తున్న కొద్దీ దట్టమైన నీలిమబ్బులాగా కనిపిస్తుంది. ఊడలు దిగిన ఎత్తైన చెట్లు మసకమసకగ్గా కనిపిస్తాయి.

కొండమీదికి నాలుగుమైళ్ల ఇరుకురోడ్డు. రెండు మైళ్ళు ఎక్కిన తర్వాత కాస్త సమతలంగా వుంటుంది. జీపుల్లోకంటే, నడిచి వెళ్లడమే బాగుంటుంది.

ఇలా ప్రయాసతో, పట్టుదలతో కొండలూ పర్వతాలూ ఎక్కడం, శిఖరాగ్రాన్ని చేరుకోవడం దేనికి? చలిగాలి మంచు మొదలైన ఈతిబాధల్ని ఓర్చుకుంటూ అష్టకష్టాలు పడి ప్రపంచంలోని ఉన్నతోన్నత శిఖరాల్ని అధిరోహించడంలోని ఆంతర్యం ఏమిటి? ఇందువల్ల కలిగే ఫలితం ఏమిటి?

ప్రతి వ్యక్తీ తన జీవితాన్ని విజయవంతం చేసుకోవాలనే తాపత్రయపడతాడు. నిజంగా యింతకంటే న్యాయమైన కోర్కె యింకొకటి వుండదు. కానీ యీ కోర్కె నెరవేరడానికి ఎంతో శ్రమ పడవలసి వుంటుంది. ఎన్నో అవాంతరాల్ని దాటాల్సి వుంటుంది. దీని కంతటికీ తగిన సౌశీల్యం, సహనం, సుఖమైనా

దుఃఖమైనా-జయమైనా అపజయమైనా—సమానంగా భావింపగలిగినంతటి మనోదార్ఢ్యం—వీటిని అలవరచుకోవడం చాల అవసరం. అటుపిమ్మట నెరవేరని ఆశయమంటూ వుండదు. ఎత్తైన పర్వత శిఖరాల్ని చేరుకోవడమనేది ఒక విజయచిహ్నం మాత్రమే! శిఖరాగ్రాన్ని చేరుకోగలమనే ఊహ ఎంతో ఉత్తేజాన్ని, తృప్తిని, ఆనందాన్నీ యిస్తుంది. ప్రతిఫలాపేక్షతో కాకుండా, ఈ సత్యాన్ని దృఢతరం చేయడానికే అది నుంచీ ఎందరో సాహసోపేతులైన వ్యక్తులు ఆకాశాన్నంటే శిఖరాలను చేరుకోవడానికి కృషి చేస్తూ వచ్చారు. ఎన్నోసార్లు అపజయం పొందినా, ఆ ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్నా, వారి కృషికెప్పుడూ భంగం కలుగలేదు.

తలుపు కిర్రుమన్న శబ్దం...

ఆలోచనా స్రవంతికి ఆనకట్ట!

'ఇదిగో బాబూ, పాలు!' అంటూ లోపలికొచ్చాడు బంగాళా వాచ్‌మేన్.

సుమారు ఏభై సంవత్సరాల వయస్సుగల శుష్కశరీరం. సగానికి పైగా నెరసిన వెంట్రుకలు. పై పెదవిని కొద్దిగా కప్పేస్తూన్న మీసాలు. బిళ్లగోచీ, బనీను, కండువా, మాసిన తలపాగాతో అతివినయంగా నిలుచున్నాడతను పాలచెంబుతో. మధ్యాహ్నం మేము బంగళాను సమీపిస్తున్నప్పుడు కూడా యిదే వినయంతో మాకు ఎదురువచ్చాడు.

పాలచెంబు కిటికీ దగ్గరున్న బల్ల మీద పెడుతూ 'ఇంకా భోంచేయలేదా, బాబూ?' అన్నాడు. ఇతరుల బాగోగులపట్ల ఆసక్తి, సేవాభావం ఆ గొంతులో నిండివున్నాయి.

'ఆకలి కావడంలేదు...ఇబ్బంది అనుకోకుండా ఒక సిగరెట్ ప్యాకెట్ తెస్తావా?' అని అడిగాను, రూపాయికాగితం తీస్తూ, 'అలాగే బాబూ!' అంటూ రూపాయి అందుకుని వెళ్లిపోయాడు.

అతని వాలకం చూస్తుంటే, ఏదో తీరని ఆవేదనను తనకు ప్రసాదింపబడిన యావదైశ్వర్యంగా భావించి భరిస్తూన్నట్లు వ్యక్తమౌతోంది. ముడతలు పడ్డ అతని ముఖంలో శాంతము, సహనము మూర్తీభవించివున్నా—ఏవో విషాదచ్ఛాయలు తొంగిచూస్తూనే వున్నాయి. దీనికి కారణం ఏమై వుంటుందని కొంతసేపు ఆలోచించాను.

కొండలూ కోనలూ, జలపాతాలు, పచ్చిక మైదానాలు, నదీతటాలు, సముద్రతీరాలు—ఇలాంటి ప్రకృతి దృశ్యాల కౌగిళ్లలో ఎల్లప్పుడూ సౌందర్యం తాండవిస్తూ వుంటుంది. వీటిని చూచి ముగ్ధులు కావాలనీ, కన్నులపండుగ చేసుకోవాలనీ ఉవ్విళ్లూరుతుంటారు ప్రజలు. పైకంతో కొనలేనిది ఏదీ లేదనుకునే సంపన్నులకు వారి సంపద కూడా యివ్వలేని ఆనందాన్ని, శాంతినీ అందించగలిగిన నందనసీమలు ఈ సుందరప్రదేశాలే! మునుల తపస్సులకు, కవుల వర్ణనలకు, చిత్రకారుల ఆరాధనకు, ఆఖరికి ప్రేయసీ ప్రియుల శృంగార విహారాలకు సైతం యివే కట్టుగట్టులు! ఇక్కడ సౌందర్యానికీ సుఖానికీ తప్ప మరి దేనికీ తావులేదు.

ఇక్కడకూడా ఈ నిరాశాజీవులు ఎలా సృష్టించబడ్డారు ?

* * *

చివరంటా కాలిన సిగరెట్టు చురుక్కుమని వేలు కరిచింది. భావజగత్తులోనుండి కూలిపడ్డాను.

ఇహ భోంచేదామని మా ఆవిడవైపు చూశాను. ఆవిడకప్పుడే గాఢంగా నిద్రపట్టేసింది. క్రితం రాత్రి రెండుగంటలనుంచీ సామాన్లు సర్దుతూ వుండడంచేత అంతగా బడలిపోయింది. 'సరూ!' అని పిలిచాను. లేవలేదు. నాలుగైదుసార్లు అలా పిలిచి తట్టి లేపడంతో విసుక్కుంటూ లేచి కళ్లు నులుముకుంటూ అలాగే కూచుంది. ఆవిడ మళ్లీ సోలిపోకముందే 'దేవిగారు భోంజేసి పడుకో కూడదా?' అన్నాను.

ఒకసారి ఆవులిస్తూ 'టై మెంతయింది?' అంది.

'తొమ్మిది!...ఆకలిగాలేదా?'

ఆవిడ అతికష్టంమీద ముఖం కడుక్కుని వచ్చేలోగా గ్లాసులో నీళ్లుపోసి, క్యారియర్ తీస్తూ సర్వర్ పనికి సిద్ధపడ్డాను.

'చాల్లే, ఏం పనిది? ఇలాతే!' అంటూ చిరుకోపం నటిస్తూ వడ్డించడం మొదలుపెట్టింది సరూ.

భోజనం పూర్తిచేసి, మూసిన కిటికీదగ్గరగా కుర్చీవేసుకుని 'మామ్' నవల తీసుకున్నాను.

పదిహేను పేజీలు చదివేలోగా 'చదవడం యిక చాలు. రేపు చదవొచ్చు.' అంటూ నిద్ర కళ్లతో ఓవల్టీన్ అందించింది సరూ.

'చాలా నీరసంగావున్నావు సరూ!' అన్నాను గ్లాసు అందుకుంటూ.

'అబ్బే, ఏంలేదు. తెల్లవారితే అంతా సరిపోతుంది' అంటూ పక్కమీదికి వెళ్లి పడుకుంది. ఆవిడకు నిద్రాభంగం కలుగకూడదని లైటు ఆర్పి మళ్లీ కుర్చీలో కూర్చున్నాను.

గదంతా చీకటి. ఏమీ తోచడం లేదు. లేచి చప్పుడు కాకుండా కిటికీ తెరిచాను. కిటికీగుండా చల్లని తెల్లని వెన్నెల గదిలోకి చొచ్చుకుని వచ్చింది. బయట ప్రశాంతత వెల్లివిరుస్తోంది. పూలమొక్కలు నిద్రపోతున్నాయి. చెట్లకొమ్మలు మెల్లమెల్లగా కదులూ ఒకదానికొకటి తాకుతూ విడిపోతున్నాయి. ఆకాశంలో చంద్రుడు చిన్నిచిన్ని మబ్బులలో దాగుడు మూతలాడుతున్నాడు. దూరాన్నించి కీచురాళ్ల రొద అరిగిపోయిన గ్రామఫోనుపాటలా వినబడుతోంది.

ఈ రామణీయకతను తిలకిస్తూ యింకా కాసేపు మేల్కొనివుందామనుకుంటూవుండగా, సిగరెట్టు జ్ఞాపకానికొచ్చిం ది. గంటన్నరక్రితం సిగరెట్టుకని వెళ్లిన మనిషి యింకా రాలేదు. దుకాణం దగ్గర్లోనే కదా వుంది! బహుశా మరిచిపోయి వుంటాడేమో—అనుకున్నా.

ఇంతలో తలుపు నెట్టిన శబ్దం!

'క్షమించాలి బాబూ' ఆలస్యమయింది...... ఇంట్లో చంటిబిడ్డకు జ్వరం తగిలి మూడు రోజులైంది. చావుబ్రతుకుల్లో వుంది. ఆ పిల్ల తల్లి దిగులుపడి ఏడుస్తుంటే, దాన్ని ఓదార్చుతూ మీ సిగరెట్టు సంగతి మరిచిపోయాను...' అంటూ పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ నేలమీద తూలిపడబోయాడు. గబాలున లేచి అతన్ని పట్టుకోగలిగాను. మెల్లగా అతన్ని కుర్చీలో కూచోబెట్టడానికి ప్రయత్నించాను.

'వొద్దు బాబూ, వొద్దు' అంటూ నేలమీద కూర్చుని వెక్కివెక్కి ఏడువసాగాడు. కిటికీ వెలుతురులో అతని కళ్లలోని నీటిబిందువుల్ని స్పష్టంగా చూడగలిగాను. అతన్ని చూస్తే, రెండు రోజులనుంచీ మంచినీళ్లు కూడా ముట్టుకోలేదని తెలుస్తూంది. క్యారియరులో అన్నం యింకా మిగిలుంది. కాస్త తినమంటే ససేమిరా వద్దన్నాడు. బలవంతంమీద ఫ్లాస్కులో మిగిలిన గుక్కెడు ఒవల్టిన్ త్రాగించాను. కొంతసేపటికి కుదుటబడ్డాడతను.

'నే నెప్పుడూ యిలా అధైర్యపడలేదు. ఎన్ని కష్టాలున్నా భరించేవాడిని. ఎన్ని రోజులన్నా పస్తుండగలను. కానీ ఆ పసికందు...దానిమీద నాకు పంచప్రాణాలు...అది దక్కకుంటే...' అంటూ కండువా మడిచి నోట్లో పెట్టుకుని మళ్లీ ఏడుపు ఆపుకో ప్రయత్నించాడు. అతన్ని ఓదార్చటం ఎలాగో తెలీక మౌనంగా చూస్తూ వుండిపోయాను. కొంతసేపటికి తేరుకుని 'వెడతాను బాబూ! మీకు శ్రమ కలిగించాను. ఇక పడుకోండి...' అంటూ పైకి లేవబోయాడు.

ఎంత నిబ్బరం! అంతటి దీనస్థితిలో కూడా ఎప్పటి ధోరణిలోనే మాట్లాడగలగడం చూసి ఆశ్చర్యపడ్డాను. అతన్ని గురించి తెలుసుకోవాలనిపించింది.

'అయ్యో! అధైర్య పడకు. కష్టాలు వస్తుంటాయి, పోతుంటాయి వాటి అలజడికి తట్టుకోగలిగినవాడే మనిషి! పెద్దవాడివి, నీకు తెలియందేముంది? ఒకరి కష్టాలు ఒకరితో చెప్పుకుంటే గుండె బరువైనా తగ్గుతుంది. అసలింతకూ నీపేరైనా తెలుసుకోలేదు నేను. ఏ వూరు మీది?' అని అడిగాను, వెళ్లబోతున్నవాణ్ణి వారిస్తూ.

'బాబూ! ఈ దౌర్భాగ్యుడి వూరూ పేరూ తెలుసుకున్నందువల్ల మీకేం లాభం? అయినా నామీద యింత దయ చూపిస్తున్నందుకు నాకు నిజంగా సంతోషంగా వుంది. నా పేరు నారాయణయ్య. అందరూ నారయ్య అనే పిలుస్తారు. మాది యిక్కడే మదనపల్లె దగ్గర ఓ పల్లెటూరు...' అంటూ తన చరిత్ర చెప్పుకొచ్చాడతను.

మామూలు కథే !

అతని తండ్రికి ఆ పల్లెటూళ్లో చక్కని పొలం వుండేది. ఏ కొరతా లేకుండా బ్రతికారు. కానీ నారయ్య తల్లి చనిపోయినప్పటినుంచీ అతని తండ్రికి జీవితంపట్ల ఆసక్తి నశించింది. జూదం అలవాటు చేసుకుని అప్పుల పాలయ్యాడు. చివరికి పన్నెండేళ్లయినా నిండని నారయ్యను ఒంటరిగా వదిలేసి కన్ను మూశాడు. అప్పటినుంచీ నారయ్య కష్టజీవుల జాబితాలో చేరిపోయాడు. చదువు సంధ్యలకు నోచుకోలేదు. ఆ వూళ్లోనే కూలీ నాలీ చేసుకుంటూ, పశువుల్ని కాస్తూ పెరిగి పెద్దవాడయ్యాడు. ఇరవై ఏళ్ల వయస్సులో ఫారెస్ట్ వాచర్‌గా నౌకరీ సంపాదించాడు. ఒక పేదింటి పిల్లను పెళ్లాడి సంసారయాత్ర ప్రారంభించాడు. ఇద్దరు కూతుళ్లూ, ఒక కొడుకూ కలిగారు. పెద్దపిల్లకు పెళ్లయింది. ఒక చంటిపిల్ల కూడాను. కాని ఆమె పెనిమిటి పచ్చితాగుబోతు. అతడు పెట్టే యమయాతన భరించలేక పుట్టింటి కొచ్చేసింది. తానెన్ని కష్టా లనుభవించినా, తన పిల్లలు సుఖంగా వుండాలని వెయ్యి దేవుళ్లకు మ్రొక్కేవాడు నారయ్య. తన పెద్దకూతురు బ్రతుకిలా బండలు కావడంతో అతడెంతో కృంగిపోయాడు. రెండోపిల్ల పెళ్లి కెదిగింది. ఇక కొడుకు సంగతి చూస్తే, వాడి చదువు చట్టుబండలైంది. పదహారేండ్లు పైన వేసుకుని, పగ్గంతెగిన ఆబోతులా తిరుగుతున్నాడు. ఎప్పటికైనా ఈ కష్టాలన్నీ గడిచి గట్టున పడగలననే నమ్మకంతో ప్రాణాలు చిక్కబట్టుకుని బ్రతుకుతున్నాడు నారయ్య...

నారయ్య వెళ్లిపోయి చాల సేపయింది.

నాకు నిద్రపట్టలేదు.

అతడు చెప్పుకొచ్చిన ప్రతివిషయాన్నీ పదేపదే నెమరు వేసుకుంటూ చీకట్లోనే కూర్చున్నాను.

ఆ చీకట్లోనే విన్నాను, అతని వృత్తాంతమంతా ఇలాంటి కథలలోని విషాద వాహినులను దర్శించడానికి వెలుతురు అక్కర్లేదు. హృదయంలోని చిన్న దీపకళిక చాలు!

నారయ్య తెచ్చిన సిగరెట్ ప్యాకెట్‌లో ఒక్క సిగరెట్టు మాత్రమే మిగిలింది. ఆఖరుసారిగా దాన్ని పీలుస్తూంటే, నారయ్యవంటి దౌర్భాగ్యుల కష్టాలన్నిటికీ కారణం-ఆర్థిక దురవస్థే ననిపించింది. అది తొలగిపోయిననాడు భౌతిక జీవితంలో దుఃఖమంటూ వుండదు.

లోకంలో అందరూ డబ్బు సంపాదించ గలిగితే ఎంత బాగుణ్ణు !

అయితే అందరూ సంపాదించలేరు.

కొందరే!

ఈ కొందరిలో రెండు తెగలు. 'ధన మూలమిదం జగత్' అనే ఆశయంతో తనకోసం సంపాదించే వాళ్లు కొందరు. 'త్యాగయా సాంభృతార్జయాత్' అనే ఆశయంతో పదిమందికోసం సంపాదించే వాళ్లు కొందరు. ఈ రెండో సూక్తిని శిరసావహించి శక్తివంచనలేకుండా కష్టపడి ధనరాసుల్ని పోగుచేస్తూ తమ జీవితాలను దేశసేవకు అంకితం చేయగలిగిన మహాత్ములే ప్రత్యక్ష దైవాలు! అటువంటి ఉద్ధారకులు కొందరున్నా చాలు, దేశంలో కష్టాలుండవు!...

* * *

'ఎనిమిది కావస్తూంటే, యింకా ఏమిటీ నిద్ర? లే!' అన్నమాటలు ఎక్కడో మరో లోకంనుంచి వినిపించినట్లయింది. మా ఆవిడ చేతిగాజులు చెవుల్లో స్వరాలు పలుకుతూంటే, కళ్లు తెరిచి చూశాను.

'లే, స్నానం చేద్దువుగానీ!' అంది మందహాసంతో.

'రాత్రంతా నిద్రపోలేదు. నువ్వు లేపకుండా వుంటే, పదిగంటలదాకా పడుకుని వుండేవాణ్ణి.' అన్నాను, లేచి కూర్చుంటూ.

'ఎలా పడుతుందీ నిద్ర?...ఇంకో ప్యాకెట్టు సిగరెట్లు కాల్చలేక పోయావ్?' అంటూ టూత్ బ్రష్ అందించింది.

స్నాన పానాదులన్నీ ముగిసిన తర్వాత, నారయ్య దుస్థితిని గురించి చెబుతున్నాను సరస్వతితో. ఇంతలో ఒక జీపు బంగళాముందు ఆగింది. వాకిలిగుండా చూశాను. నీలిరంగు సూటులోవున్న యువకుడొకడు, ఓ పాతికేళ్ల అప్సరసా జీపులోంచి దిగారు. వారి

వెంట తోడేల్లాంటి కుక్క ఒకటుంది. నౌకరుకూడా వున్నాడు. నౌకరు సామాన్లను ఒక్కటొక్కటే దించే సరికి నారయ్య పరిగెత్తుకుంటూ వొచ్చి పక్కగది తాళాలు తీశాడు. వాళ్లంతా లోపలికి వెళ్లారు.

అప్పటినుంచీ ఓ అరగంటదాకా ఏవేవో మాటలు వినిపిస్తూనే వున్నాయి. ఒక్కోసారి బిగ్గరగా మాట్లాడు తున్నారు.

'చూడండీ, గోపీ చాలా అలసిపోయాడు... రంగా! గోపీకి పాలు తాపు...' అంటోందా స్త్రీ కంఠం.

'రంగా! ముందు భోజనం సిద్ధంచెయ్యి. తొందరగా భోంచేసి, విశ్రాంతి తీసుకోవాలి' అంటున్నాడా యువకుడు.

'వాళ్లవెంట చిన్న పిల్లలెవరూ లేరే...మరి గోపీ గోపీ అని ఎవర్ని పిలుస్తున్నారు? అంటూ నా వైపు చూసింది సరస్వతి.

'సరిగ్గా నీ సందేహమే నాకూ పట్టుకుంది. చూద్దాం, వుండు...' అంటూ లేచివెళ్లి వాకిట్లో నుంచున్నాను. అతడు వరండాలో నిలుచుని, అక్కడి పూల మొక్కల్ని, క్రింద తమ జీపు ప్రయాణించిన రోడ్డుని తిలకిస్తున్నాడు.

ఆశ్చర్యం!

ఎవరతను? నా బాల్య మిత్రుడు పరశురామేనా?!

వెంటనే 'పరశురాం!' అని పిలిచాను.

అతను వెనక్కి తిరిగి చూశాడు.

'అరె!...శంకరం!...ఎక్కడున్నావురా? తమాషాగా వుందే! రారా లోపలికి!' అంటూ తుఫానులా వచ్చి పైనబడి, అమాంతంగా లోపలికి లాక్కెళ్లాడు.

'రాధా! వీడెవడో తెలుసా? నా బాల్య స్నేహితుడు—శంకరం! ప్రస్తుతం రైల్వేగార్డుగా వుంటున్నాడు...కదుట్రా?'

తల వూపాడు.

'నమస్తే!' అందామె చిరునవ్వు ఒలకబోస్తూ.

రెండు చేతులూ జోడించి ఆమెకు ప్రతి నమస్కారంచేస్తూ 'ఉండండి, మా ఆవిణ్ణి తీసుకొస్తాను...' అన్నాను.

..నేనూ పరశురాం—కలిసి చదువుకున్నాం. ఉదర పోషణార్థం నేను రైల్వేలో చేరాను. అతను మాత్రం బి. కాం. చదువుకుని విశాఖపట్నంలో ఏదో బ్యాంకులో చేరాడు. మంచి అందగాడు. ఎదుటి వ్యక్తుల్ని యిట్టే ఆకర్షించగల మాట తీరు వున్నవాడు. బ్యాంకు ప్రొప్రయిటరుగారమ్మాయి రూపంలో అదృష్టం కలిసొచ్చింది. ఆమె హృదయాన్ని దోచుకున్నాడు. ఆమెను పెళ్లి చేసుకున్నాడు. అతడిప్పుడు ఆ బ్యాంకు మేనేజరు...

మా ఆవిణ్ణి తీసుకొచ్చి పరిచయం చేయబోయాను. పరిచయం చేసుకోవడమనే అనుభవం ఆవిడకిదే మొదటిది కావటంచేత సిగ్గుతో తలవంచుకొంది. కాస్త సిగ్గయినా తొలగించాలని 'సరూ! వీరు మన స్నేహితులు. వీరికి మనమంటే చాల అభిమానం. వీరికి నమస్కరించు!' అన్నాను. ఆమె తలవొంచుకుని 'నమస్కారం అన్నయ్యా!...నమస్కారం అక్కయ్యా!' అంది.

పాపం, ఆమె పరిస్థితి నాకు జాలి గొలిపింది. సిగ్గుతో సతమతమౌతూన్న అమాయకురాలిచేత సంస్కారం పేరిట అలవాటులేని పని చేయించినందుకు నేనే లోలోపల సిగ్గుపడ్డాను.

'అలా నిల్చున్నారేం, కూర్చోండి!' అని అతనంటూవుంటే సరస్వతి సంకోచిస్తూ వుంది. 'పర్వాలేదులే చెల్లాయ్, కూర్చో!' అన్నాడతను. ఆవిడ కూర్చోక తప్పింది కాదు. నలుగురం సోఫాల్లో కూర్చున్న పిమ్మట నౌకరు కమ్మని కాఫీ అందించాడు.

'ఈ వేళ కిక్కడే భోంచేయాలి అందరూ. తెలిసిందా?' అన్నాడు పరశురాం. వద్దంటే విడిచిపెట్టడు గనుక కాదనలేకపోయాము. భోజనం రెడీ కావటానికి మరో గంటయినా పట్టవచ్చు. ఆలోగా

బాతాఖానీకి పూనుకున్నాం. సరస్వతి మాత్రం వంచిన తల ఎత్తడంలేదు.

మా సంభాషణ ఒక చిన్న సభగా తయారయింది. రాజకీయాలు, సినిమాలు, పత్రికలు, స్త్రీ స్వాతంత్ర్యం, సంస్కృతి, అలంకారాలు, ఆదర్శాలు... ఒక్కటా? లెక్కలేనన్ని విషయాలు!

మా సంభాషణలో శ్రీమతి రాధాదేవిదే పైచేయి!

'ఈ నవనాగరిక యుగంలో కూడా స్త్రీలు వంటింట్లో దాసీల్లాగా పడివుండడం చాలా శోచనీయం. మన స్త్రీలు పొద్దస్తమానము భర్తకు, పిల్లలకు వెట్టిచాకిరీచేస్తూ, సంస్కారం లేక తమ జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు...

'స్త్రీ అంటే ఒక ఆటవస్తువుగా భావించే రోజులు గతించాయి. స్త్రీకి కూడా ఆశయాలూ అభిరుచులూ వుంటాయి. జీవితమంతా ఊడిగంతో గడుపుతూంటే, ఆమె ఆశయాలు కార్యరూపం పొందేదెల్లాగు?...'

సరస్వతి నా వైపు అయోమయంగా చూస్తున్నదల్లా, 'వింటున్నారా సరస్వతిగారూ!' అన్న రాధాదేవి గారి పిలుపుకి ఉలికిపడింది.

'పాశ్చాత్యదేశాల్లో స్త్రీలు మనకంటే ఎంతో ముందుకుపోయారు. అసలు వాళ్ల దేశాల్లో పిల్లలకి తల్లితో ఎట్టి సంబంధమూ వుండదు. పిల్లల్ని కని పెట్టుకుని వుండటానికి ప్రత్యేకమైన నర్సులు వుంటారు. వంటచేయటం, బట్టలుతకటం వగైరా అసభ్యకరమైన పనులు వాళ్లకు లేవు. వాళ్లెప్పుడూ శుభ్రంగా వుంటూ, చిత్తం వచ్చినట్లు తిరుగుతూంటారు. అక్కడివాళ్లు తమ విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోటానికి స్నేహితులతో కలిసి క్లబ్బులకు వెళ్లవచ్చు. ఆ దేశాల స్త్రీలను చూసి మనం నేర్చుకోవలసింది ఎంతో వుంది...'

ఆమె వాగ్ధాటికి అబ్బురపడుతూ, బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నాను. పాశ్చాత్య దేశాల స్త్రీలను గురించి పాశ్చాత్యులకంటే ఎక్కువగా తెలుసుకోవడం నోటిమాటలా?

'ఆదర్శాలు ఒక్క పురుషులకేనా? స్త్రీలకూ వుండొచ్చు సవాలక్ష! మాట వచ్చింది కనుక చెబుతున్నాను. నేను మాత్రం, చచ్చినా నా ఆదర్శాలను చంపుకోను. నామటుకు నేను సౌందర్యమంటే పడి చస్తాను. అందాల పోటీలంటే నాకు ఆరో ప్రాణం. బొంబాయిలో జరిగే కుక్కల అందాల పోటీలో ప్రతి సారీ పాల్గొంటాను. ఈఏడు గోపీని తీసుకువెడుతున్నాను. మా గోపీ మీకు నచ్చాడా?' అంటూ తనకు దగ్గరగా కూర్చున్న కుక్కవైపు చూసింది రాధాదేవి.

సరస్వతి కళ్లు ఆశ్చర్యంతో వేగుచుక్కల్లా వెలిగాయి.

నా దృష్టి కాస్సేపు కుక్కమీద నిలిచింది. అది నా వైపు తీక్షణంగా చూస్తోంది. ఏ క్షణాన్నయినా ఎగిరి మీద పడేటట్టుంది.

గోపీని మాతో కరస్పర్శ చెయ్యమంది రాధాదేవి. వెంటనే ఆ కుక్కలేచి తన ముంగాలిని నా చేతిలోవుంచి, మళ్లీ యథాస్థానంలో కూర్చుంది.

'కుక్కలు ఎట్టి కష్టాలయినా ఎదుర్కోగలవు. ఇవి ఆకలి బాధనుసైతం లెక్కచేయకుండా తిరుగుతూ వుండగలవు. మనలాంటి చదువుకున్న వ్యక్తులు కుక్కల్ని పెంచడం ఎంతో ముఖ్యం.'

మనుష్యులకు వర్తింపజేసుకుంటే, కుక్కల్ని గురించి ఆమె చెప్పిన మాట అక్షరాలా నిజం. ఆకలితో బాధపడే మనుషులు కూడా ఆకలి బాధను సహించడం ఒక్కటే పరిష్కార మార్గం. మానవుడు యుగాల తరబడి కరువు కాటకాల్లో ఆకటిచిచ్చును చల్లార్చుకోవటానికి ఈ మార్గాన్నే అవలంబిస్తున్నాడు కదా!

సరిగ్గా ఈ సమయానికే ఆకలి కొద్ది కొద్దిగా కట్టుత్రాళ్లు విప్పుకుంటోంది. పన్నెండు గంటల కల్లా భోజనం సిద్ధమైంది.

తాంబూలాలు వేసుకుని మా గదిలోకివెళ్ళి

కాస్త విశ్రాంతి తీసుకున్నాము. సాయంత్రం ప్రయాణ సన్నాహాలు పూర్తి చేసుకుని, సెలవు తీసుకుందామని పరశురాం వద్దకు వెళ్లాను. 'ఏమంత తొందర? ఎల్లుండిదాకా మాతో కలిసి వుండలేవూ?' అన్నాడు. మరోలా అనుకోవద్దనీ, మరునాటి ఉదయమే డ్యూటీలో చేరాలనీ చెప్పగా సరే నన్నాడు. తనే మమ్మల్ని జీపులో స్టేషన్‌దాకా తీసుకెళ్లి దిగవిడిచి వస్తానన్నాడు.

చల్లని సంజవేళ జీపులో కూర్చున్నాం ముగ్గురం. వెనక మా ఆవిడ, ముందు సీట్లో మే మిద్దరిమూను. నారయ్య మమ్మల్నిచూస్తూ కొద్ది దూరంలో నుంచున్నాడు. అతన్ని దగ్గరకు పిలిచి ఐదు రూపాయలివ్వబోయాను. తీసుకోవటానికి వెనకాడుతూ 'నా కెందుకు బాబూ?' అన్నాడు. బలవంతాన అతని చేతిలో పెట్టాను.

'పాపకెలా వుంది నారయ్యా?'

'అలాగే వుంది బాబూ!'

జీపు బయలుదేరుతుండగా రెండు చేతులూ జోడించాడు నారయ్య.

అతడి పంచప్రాణాలూ అయిన ఆ చంటిపిల్ల జబ్బు నయమవుతుందో, కాదో?

అతడి పెద్దకూతురు కాపురం బాగుపడుతుందో, లేదో?

చిన్నమ్మాయి పెళ్లి చేస్తాడో, చెయ్యలేడో?

అతడి కొడుకు ప్రయోజకుడు కాగలడో, లేడో?

కష్టాలు గడిచి గట్టెక్కుతాడో, లేక ఆ కష్టాల్లోనే మునిగిపోతాడో?

అన్నీ ప్రశ్నలే!

ఈ ప్రశ్నలన్నిటికీ సరైన సమాధానాలు చెప్పకోగలనా నేను?

జీపు కొండదిగి లోయలో పయనిస్తూంది. అక్కడక్కడా పాత రోడ్డు స్థానంలో కొత్త రోడ్లు వేస్తున్నారు. మిట్టపల్లాలు ఏకం చేస్తున్నారు. రాళ్లను పగల గొడుతున్నారు. వీళ్లంతా కష్టజీవులు! పొద్దస్తమానమూ శ్రమిస్తున్నా, వీరిలో ఏ ఒక్కరూ గొప్పవారు కాలేకపోతున్నారు. పోనీ, ఈ బాహిరదృష్టికి వీరి ఔన్నత్యమైనా అవుపిస్తున్నదా? లేదు! ఇదే ఒక సినిమాలోనైతే వీరిని చూచి అంతా జాలిపడేవారే! భావుకులైతే వీరి శ్రమను గుర్తించామన్నందుకు దాఖలాగా ఓ కథో, ఖండకావ్యమో రాసేవాళ్లే! కానీ ప్రత్యక్షంగా చూచిన వాళ్లందరూ వీరిని చూచీ చూడనట్లు, తామరాకుమీద నీటి బొట్టులా అంటీ అంటనట్లు వుంటారు. నకిలీ దైన్యంపట్ల వున్నంత అనుకంప ప్రత్యక్షదైన్యంపట్ల లేదు. ప్రపంచంలో యింతకంటే ఆత్మద్రోహం మరొకటి వుండదు.

కష్టజీవులే ప్రపంచానికి కొత్త దారులు చూపించారు. పైరుపచ్చల్ని సృష్టించారు. పట్టణాలను నిర్మించారు. దేవాలయాలూ దుర్గాలూ కట్టారు. మహానదులను లొంగదీసి ఆనకట్టలు వేశారు. వీరు స్వార్థరహితులు. త్యాగధనులు. లోకకల్యాణానికి అఖండ జ్యోతుల్ని వెలిగించడం, ఆ జ్యోతులకు తాము వత్తులై కాలి నుసియైపోవడం—యిదే వీరి చరిత్ర! అందుకేనేమో, విశ్వకవి అన్నాడు—శ్రమలోనే భగవంతు డున్నాడని!

'ఏమిట్రా, అంత గాఢంగా ఆలోచిస్తున్నావ్?' అన్నాడు పరశురాం.

'కష్టసుఖాలను గురించి.'

'ఏముంది వాటిని గురించి ఆలోచించటానికి?'

'ఏమీ లేదా?'

పరశురాం నవ్వాడు.

'నువ్వు అదృష్టవంతుడివి పరశురాం!' అన్నాను.

'ఎందుకూ?'

'కష్టసుఖాలు ఆలోచనలోకి రానంత సుఖంగా బతుకుతున్నావ్. ప్రతివాడూ నీయంత సుఖంగా వుంటే బాగుండును.'

పరశురాం ముఖంలో మళ్లీ అదే నవ్వు. అతడు నిశ్చలంగా యిలా చెప్పసాగాడు.

'శంకరం! జీవితంలో సుఖపడటం, కష్టపడటం—వీటికి నిజంగా ఎలాంటి ప్రాముఖ్యతా యివ్వరాదు. ప్రపంచంలో ఎక్కడైనాసరే, మంచీ చెడూ దూరదూరంగా లేవు. రెండూ పక్కపక్కనే వుంటాయి. హాలాహలం లేకుండా అమృతం పుట్టదు. నీడ పడకుండా దీపం వెలగదు. శిఖరాలు లేకుండా లోయలుండవు. జీవితంలో కష్టసుఖాలు కూడా యింతే! అయితే మనిషికి అసంతృప్తి సహజం. ఈ అసంతృప్తికి కారణం—ఒకరు యితరుల కష్టాలను తెలుసుకోటానికి బదులు తమతమ సుఖదుఃఖాలనే సాక్ష్యంగా తీసుకుని ఎవరికి తోచిన అభిప్రాయాలను వారు ఏర్పరచుకోవడమే! నా విషయంలో నీ అంచనా తప్పు. మా ఆవిడ వాలకం చూశావు గదా?...భార్యాభర్తల ప్రేమానురాగాలమీద నాకు నమ్మకంలేదు. ఇది నా వ్యక్తిగతాభిప్రాయం మాత్రమే సుమా!...అయితే నా మనస్సులో ఎలాంటి బాధా లేదు. నా అనుభవంలో జీవితాన్ని గురించి నేను తెలుసుకున్నదల్లా ఒక్కటే...

'జీవితమనేది అత్యంత సుందరమైనది. సుఖమైనా, కష్టమైనా — అనుభవించటానికే కష్టాలున్నాయని ఈ అందమైన జైలులోంచి పారిపోలేము గదా? మనిషి సుఖదుఃఖాలను సమన్వయం చేసుకున్నప్పుడే జీవితానికి నిండుదనం!'

స్టేషన్ చేరుకునేసరికి పొద్దుపోయింది.

మరో పది నిమిషాల తరవాత 'వెళ్లొస్తాను శంకరం! అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూండు'... అంటూ నన్ను గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు పరశురాం. 'వెళ్లొస్తానమ్మా చెల్లాయ్' అంటూ జీపు పోనిచ్చాడు.

'చిత్రమైనవాళ్లే యిద్దరూ!' అంటూ బుగ్గ నొక్కుకుంది సరస్వతి.

కొద్ది క్షణాల్లోనే కనుచూపు మేర దాటిపోయింది జీపు. జీవితానికి ప్రతికృతిలా దూరంగా వెన్నెల ఒడిలో లోయలూ, శిఖరాలు!

